క్లుప్తంగా

సంతకాల సేకరణ

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర విభజనలో రాయలసీమకు సమాన వాటా కావాలంటూ రాయలసీమ సమైక్య ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి మల్లెల జగదీష్, రాయల కరీం సేవాసమితి అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా చేపట్టారు. ఇందులో భాగంగా రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కడప నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఉన్న నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రేపు పర్యావరణ దినోత్సవ కార్యక్రమం

కడప కల్చరల్ : అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో సోమవారం పర్యావరణ రక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ కడప చాప్టర్ కన్వీనర్ చిన్నపరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో పాత కలెక్టరేట్‌లోని కొంత భాగాన్ని శుభ్రం చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామని, భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పన గురించి చర్చించనున్నామని వివరించారు.

మురుగునీటితో దుర్వాసన



రోడ్డుపై నిలబడిన మురికి నీరు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ సమీపంలో మెయిన్‌రోడ్డుపైనే మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఆ మురుగునీటిలోనే మోటారు బైకులు, కార్లు, బస్సులు, ఆటోలు రాకపోకలు సాగిస్తున్నాయి. రెండు, మూడురోజులుగా నీరు అధికమవుతున్నాయే తప్ప ఇంకిపోవడం లేదు. ఆర్టీసీ గ్యారేజీ పక్కన ఉన్న డ్రైనేజీ కాలువ పొంగి రోడ్డుపై నీరు ప్రవహిస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు డ్రైనేజీలోని చెత్తాచెదారాలను తొలగించి నీరు నిల్వ లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రైలు ప్రమాద ఘటన బాధాకరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఒడిస్సాలో జరిగిన రైలు ప్రమాదంలో వందలాది మంది మృతి చెందడం బాధాకరమని రైల్వే యూజర్స్ కన్సెల్టేటివ్ కమిటీ మెంబర్ వైవీ డేవిడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు రైల్వే అధికారులతో మాట్లాడామన్నారు. వైఎస్సార్ జిల్లా ప్రయాణికులు ఎవరైనా ఉంటే పేర్లతోసహా తెలిపి జాగ్రత్తలు తీసుకోవాలని గుంతకల్లు డీఆర్‌ఎం వెంకట రమణారెడ్డిని కోరామన్నారు. అలాగే విశాఖపట్టణం రైల్వే అధికారులతో కూడా చర్చించామని, ఏసీ బోగీలలోఉన్న వారు క్షేమంగా ఉన్నారన్నారు. అలాగే క్షతగాత్రులతో మాట్లాడి వారి విషయంలో జాగ్రత్త వహించి చికిత్స అందించాలని, అలాగే రైలు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను స్వస్థలాలకు చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు.

5న వానపాముల ఎరువుల తయారీపై శిక్షణ

కడప అగ్రికల్చర్ : కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో 5వ తేదీన వానపాముల ఎరువు తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. ఆసక్తి గల రైతులు 8096888039 నెంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

నేడు ఎకోపార్కులో పర్యావరణంపై ఎగ్జిబిషన్

ప్రొద్దుటూరు క్రైం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎర్రగుంట్ల రోడ్డులోని రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో ఆదివారం మిషన్ లైఫ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు సబ్ డీఎఫ్ఓ ఎస్‌వీ దివాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణంపై పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిషన్‌లను ఆది, సోమవారాల్లో రెండు రోజుల పాటు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

5న ఆలయ ప్రథమ వార్షికోత్సవం

చెన్నూరు : స్థానిక అరుంధతినగర్‌లో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలను ఈనెల 5వ తేదీ సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కొండూరు ఓబులేసు శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. సోమవారం ఉదయం 5 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, 6 గంటలకు అభిషేకం, ప్రత్యేక అలంకరణలు, 7 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం, ఉదయం 10 గంటలకు వేద పండితులచే శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం, 12 గంటలకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



ప్రదర్శనగా ఉంచిన మిల్లెట్స్



మాట్లాడుతున్న నెహ్రూ యువజన కేంద్ర జిల్లా అధికారి మణికంఠ

నెహ్రూ యువజన కేంద్రం జిల్లా అధికారి మణికంఠ

కడప ఎడ్యుకేషన్ : మిల్లెట్స్‌తో కూడిన ఆహారంతోనే ఆరోగ్యం అని నేటి యువత అలాంటి ఆహార విధానం అలవాటు చేసుకోవాలని నెహ్రూ యువజన కేంద్ర జిల్లా అధికారి మణికంఠ పిలుపు నిచ్చారు. భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మిషన్ లైఫ్ మేరీ లైఫ్‌లో భాగమైన లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్స్ అంశంపై ప్రమోషన్ ఆఫ్ మిల్లెట్స్ అనే కార్యక్రమాన్ని కడప నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ట్రెనింగ్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మణికంఠ మాట్లాడుతూ చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని యువత అలవాటు చేసుకుని రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. చిరు ధాన్యాల ఎక్స్‌పర్ట్ కల్లూరు రఘురామిరెడ్డి చిరు ధాన్యాల ఉపయోగం, వాటి ద్వారా వచ్చే పోషకాల గురించి తెలియజేశారు. నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సుబ్బరామిరెడ్డి మాట్లాడారు. అనంతరం చిరుధాన్యాలతోపాటు వాటితో తయారు చేసిన పిండి పదార్థాలను ప్రదర్శనగా ఉంచారు. నెహ్రూ యువకేంద్రం జాతీయ సేవా కార్యకర్తలు మల్లికార్జున, బాలాజీ, రంజిత్, కార్తీక్ పాల్గొన్నారు.

హోండా షైన్ 100సీసీ వాహనం మార్కెట్‌లోకి విడుదల



వినియోగదారుడికి తాళాలు అందిస్తున్న వన్‌టౌన్ సీఐ నాగరాజు

కడప కార్పొరేషన్ : హోండా ద్విచక్ర వాహనాల కంపెనీ నూతనంగా ప్రవేశపెట్టిన హోండా షైన్ 100సీసీ వాహనం కడప మార్కెట్‌లోకి విడుదలైంది. శనివారం సాయంత్రం చిన్నచౌకులోని శ్రీ అమోఘా షోరూంలో వన్‌టౌన్ సీఐ నాగరాజు ఈ వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోండా కంపెనీ వారు తక్కువ ధరలో ఎక్కువ మైలేజీనిచ్చే వాహనాన్ని విడుదల చేయడం అభినందనీయమన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారికి, మధ్యతరగతి ప్రజలకు, వ్యాపారస్తులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తొలిరోజు 6 వాహనాలను విక్రయించామని షోరూం జనరల్ మేనేజర్ మల్లికార్జున తెలిపారు. ఫైనాన్స్ మేనేజర్ సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పురాతన ఆలయానికి మహర్దశ

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి పురాతన ఆలయానికి పునర్వైభవం లభించింది. సుమారు 600 సంవత్సరాలు చరిత్ర కలిగిన ఈ పురాతన ఆలయాన్ని రూ.64 లక్షల టీటీడీ నిధులతో అభివృద్ధి చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి 5 రోజుల పాటు సంప్రోక్షణ, కలశస్థాపన, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు ఏర్పాట్లు పూర్తి చేశారు.

రూ.64 లక్షలు మంజూరు

మట్లి రాజుల కాలంలో సుమారు 600 సంవత్సరాల క్రితం నిర్మించిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ గాలిగోపురం, విమాన గోపురం జీర్ణమై శిథిలావస్థకు చేరడంతో వాటి స్థానంలో నూతనంగా గాలిగోపురం, విమాన గోపురంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానిక నాయకులు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల దృష్టికి తీసుకెళ్ళగా వారు ఈ విషయాన్ని బద్వేలు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని టీటీడీ అధికారులకు ఆదేశాలు ఇవ్వగా వారు రూ.64 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులలో రూ.40 లక్షలతో విమాన గోపురం, గాలిగోపురం నిర్మించారు. మరో రూ.24 లక్షలతో ఆలయంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే



కొక్కరాయపల్లెలో సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శి శివకుమార్‌రెడ్డి

చెన్నూరు : మండలంలోని కొక్కరాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష (ఇళ్లు, నివాస స్థలాల సర్వే) పథకం కింద సర్వే నిర్వహించి అక్కడి ప్రజలకు శాశ్వత హక్కు కలిగించి భూ హక్కు పత్రాలను అందజేస్తున్నామని కార్యదర్శి శివకుమార్‌రెడ్డి తెలిపారు, శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొక్కరాయపల్లె గ్రామ కంఠములోని ఇళ్లకు యజమాన్య హక్కులు కల్పించేందుకు సమగ్ర సర్వే నిర్వహించి రికార్డులు రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటికే గ్రౌండ్ ట్రూతింగ్ అలాగే గ్రౌండ్ వాలిడేషన్ పూర్తి చేసుకుని డ్రాఫ్ట్ ప్రాపర్టీ రికార్డును తయారు చేయడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీలోని భూమి యజమానులకు ఈ రికార్డు గురించి తెలియజేయుట కొరకు ఈనెల 6వ తేదీ ఉదయం 11 గంటలకు కొక్కరాయపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామ సర్పంచ్ చింతల శోభ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

బాధితులకు రూ.15 లక్షల పరిహారం చెల్లించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఒడిస్సాలో జరిగిన రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ. 15 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలలో ఇంత పెద్ద రైలు ప్రమాదం ఇదేనని తెలిపారు. మోదీ తొమ్మిది సంవత్సరాల పాలనలో రైల్వేలో పర్మినెంట్ ఉద్యోగాలు తగ్గిపోయాయని, దీంతో ఉన్న ఉద్యోగాలను కూడా కాంట్రాక్టు పరం చేయడంతో లోకో పైలెట్లపై పనిభారం పడుతోందన్నారు. ఆర్‌సీపీ నాయకులు వెంకటేశ్, రాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితం కోరే కాశీవరపు రచనలు

ప్రొద్దుటూరు : కాశీవరపు వెంకటసుబ్బయ్య సమాజ హితం కోసమే రచనలు చేసే అభ్యుదయ కవి అని ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి తెలిపారు. కళాభారతి నాటక సంస్థ, చదువుల సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో కాశీవరపు వెంకటసుబ్బయ్య రచించిన 'ఎదమీటిన రాగాలు' పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. స్థానిక రోటరీ క్లబ్ సభాభవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ మనిషి మనసులోని సంఘర్షణలను, వేదనలను, భావుకతను, ఆలోచనలను వ్యక్తీకరించే సాధనం కవిత్వమని అన్నారు. సామాన్యులైన, పండితులైన తన అంతరంగాన్ని ఆవిష్కరించడానికి కవిత్వాన్ని ఆశ్రయించాల్సిందేనని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు అధికార భాషా సంఘం సభ్యుడు తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ సాహిత్యం సమాజాన్ని సంస్కరిస్తుందని తెలిపారు. విస్తృత పఠనం ద్వారా మనసు వికాసం చెందుతుందన్నారు. వైవీయూ ప్రొఫెసర్ మూల మల్లికార్జునరెడ్డి పుస్తకాన్ని సమీక్షించారు. రాయలసీమలోని కరువుగాయాన్ని, పెన్నా ఔన్నత్యాన్ని రికార్డ్ చేసిన కవి కాశీవరపు అని కొని యాడారు. పద్య కవి ఏసీ దస్తగిరి, కథా రచయిత తవ్వా ఓబుళరెడ్డి కాశీవరపు వెంకటసుబ్బయ్య కవితల గురించి ప్రస్తావించారు. కళాభారతి నాటక సంస్థ సభ్యులు కొత్తపల్లి శీను, కొమ్మిశెట్టి మోహన్, మహమ్మద్, ఖలందర్, కవులు పాల్గొన్నారు.

ప్రతి ఆదివారం 'బాల వికాస్' ఉచిత తరగతులు

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో ప్రతి ఆదివారం బాలబాలికలకు ఉచితంగా బాల వికాస్ పేరిట ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందజేయనున్నట్లు బీపీఆర్ భగవద్గీత సత్సంగం అధ్యక్షుడు పీకే సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వినూత్నంగా బాల వికాస్‌పేరిట ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని పరిచయం చేయనున్నట్లు వివరించారు. ఇందులో శ్లోకాలు, పద్యాలు, కథలు, ఏకాగ్రత పెంచే కార్యక్రమాలు నేర్పుతామని, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సత్శీలం, అభివృద్ధి పరిచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 5–15 ఏళ్లలోపు బాలబాలికలకు ఉచితంగా ఈనెల 4నుంచి శిక్షణా తరగతులు ప్రారంభిస్తామన్నారు. ఇకపై ప్రతి ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఆలయ ప్రాంగణంలోనే ఈ శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 80743 68724 నెంబరులో సంప్రదించాలన్నారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరుతూ శనివారం జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావుకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. గ్రామసభలు నిర్వహించి కౌలు రైతులను గుర్తించి బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని కోరారు. నకిలీ పురుగు మందుల నివారణకు ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏవీ సుబ్బారెడ్డి, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జేష్టమాసం మూడవ శనివారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

హామీలు అమలు చేయాలి



గేట్ మీటింగ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.తిరుపాల్, నగర అధ్యక్షుడు సుంకరి రవి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లయినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. వార్డు సచివాలయ సెక్రటరీలను రెండేళ్లకే పర్మినెంట్ చేసి జీతాలు పెంచారని, మున్సిపల్ కార్మికులు 15 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ వారిని రెగ్యులర్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, మహిళా కార్మికులు, డ్రైవర్లు, లోడర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్టా మహోత్సవం



భక్తులకు అన్నప్రసాదం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి

కమలాపురం : మండల పరిధిలోని జి.అప్పాయపల్లెలో నూతనంగా నిర్మించిన సీతా రామాలయం ప్రతిష్ట మహోత్సవాలను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సమీప గ్రామాల ప్రజలు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజుపాళెం సుబ్బారెడ్డి 300 మందికి అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ రాజారెడ్డి, వైస్ సర్పంచ్ సురేష్‌యాదవ్, చేతన్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



విద్యుద్దీప వెలుగుల్లో దర్గా

కడప కల్చరల్ : కడప నగరం అల్మాస్‌పేటలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అమీనుద్దీన్ హుసేనీ చిష్తి ఉరఫ్ హజరత్ గేసుదరాజ్ బందా నవాజ్ ఉరుసు శనివారం ఘనంగా ప్రారంభమైంది. అందులో భాగంగా ఆస్తానె మగ్దూమ్ ఇలాహి అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా మహమ్మదుల్ చిష్తివుల్ ఖాద్రీ తమ ఇంటి నుంచి గంధం కలశాన్ని ఫకీర్ల మేళతాళాలు, సాహస విన్యాసాల మధ్య స్వయంగా హజరత్ గేసుదరాజ్ బందానవాజ్ దర్గాకు చేర్చి గురువుల మజార్ల వద్ద సమర్పించారు. అనంతరం ఫాతెహా నిర్వహించి భక్తులందరికీ పంచిపెట్టారు. ఈ ఉత్సవానికి బయటి ప్రాంతాల నుంచి కూడా భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. దర్గా ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్గా ప్రాంగణం పూర్తిగా రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. 4వ తేది రాత్రి 10 గంటలకు ఉరుసు, 5న తహలీల్ ఫాతెహా నిర్వహించనున్నారు.

నేటి నుంచి చాంద్‌ఫిరా గుంబద్ దర్గా ఉరుసు

కడప కల్చరల్ : రహమతుల్లావీధిలోని ఆధ్యాత్మిక క్షేత్రమైన చాంద్‌ఫిరా గుంబద్ దర్గా ఉరుసు ఈనెల 4 నుంచి 6వ తేది వరకు నిర్వహించనున్నామని దర్గా ముతవల్లీ అమీరున్నీసా తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి గంధం, సోమవారం ఉరుసు, మంగళవారం తహలీల్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉరుసు, తహలీల్ రోజుల్లో ప్రముఖ ప్రాంతాలకు చెందిన గాయలకు ఖవ్వాలీ కచేరీ ఉంటుందని వివరించారు. భక్తులు పాల్గొని గురువుల ఆశీస్సులు పొందాలని కోరారు.

సైక్లింగ్‌తో మెరుగైన ఆరోగ్యం



ప్రపంచ సైకిల్ దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ తదితరులు

కడప రూరల్ : సైకిల్ తొక్కడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. ప్రపంచ సైకిల్ దినోత్సవ సందర్భంగా శనివారం స్థానిక కోటిరెడ్డిసర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు క్రమం తప్పకుండా సైకిల్ తొక్కడం వల్ల వ్యక్తిగత, ఆరోగ్యపరంగా కండరాలు పరిపుష్టిగా తయారవుతాయని తెలిపారు. దీంతో రక్తప్రసరణ సజావుగా సాగుతుందని, శరీరం కాస్త అలసటకు గురై ఆకలి వేయడంతోపాటు నిద్ర బాగా పెరుగుతుందన్నారు. సైకిల్ వ్యాయామం ద్వారా ప్రశాంతత చేకూరి చురుకైన ఆలోచనలు కలుగుతాయన్నారు. సైకిల్ తొక్కడాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని తెలిపారు. ఎన్‌సీడీ, ఆర్బీఎస్‌కే ప్రోగ్రామ్ డాక్టర్ వెంకట చంద్రారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, ఎన్‌హెచ్‌ఎం అండ్ డీపీఎంయూ డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, డెమో ప్రమీల, డీఎంఓ మనోరమ, డాక్టర్ ఒబేదుల్లా, ఖాజామోహిద్దీన్ పాల్గొన్నారు.

రుతుస్రావ సమయంలో పరిశుభ్రత పాటించాలి



మహిళలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ వై. సురేష్ రెడ్డి

కడప కార్పొరేషన్ : రుతుస్రావ సమయంలో పరిశుభ్రత పాటించాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వై. సురేష్‌రెడ్డి తెలిపారు. శనివారం మెప్మా కడప యూఎల్‌బీ పరిధిలో రుతుస్రావ పరిశుభ్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ నగర్ మురికివాడలో నివసిస్తున్న మహిళలకు రుతుస్రావ పరిశుభ్రత గూరి వివరించారు. 12 ఏళ్లు దాటిన ఆడపిల్లలకు వారి తల్లులు రుతుస్రావం గురించి వివరించాలన్నారు. ఆ సమయంలో పరిశుభ్రత ఎలా పాటించాలి, ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి, వాటి వల్ల కలిగే ప్రయోజనాల గూర్చి చెప్పాలన్నారు. రుతుస్రావ సమయంలో ఆడపిల్లలను ఒంటరిగా ఉంచడం, ఎవరితో కలవనీయకుండా ఉంచడం వంటివి చేయరాదన్నారు. రుతుస్రావం అనేది ప్రతి మహిళ జీవితంలో ఒక భాగమన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. నాప్‌కిన్లు వాడిన తర్వాత వాటిని పూడ్చిపెట్టడంగానీ, కాల్చివేయడంగానీ చేయాలన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఆవిష్కృతమవుతుందని తెలిపారు. అనంతరం మహిళలకు శానిటరీ నాప్‌కిన్లు పంపిణీ చేశారు. హెల్త్ అండ్ న్యూట్రిషన్ స్పెషలిస్టు డీజీవీ గోపీనాథ్, సీఎంఎం టి. హరిప్రసాద్‌రెడ్డి, సీఓలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మూగజీవులను కాపాడుకుందాం



తల్లి కళేబరం వద్ద తల్లడిల్లుతున్న కూన

కడప కల్చరల్ : యువకుల నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఓ మూగజీవిని బలితీసుకుంది. వివరాల్లోకి వెళితే.. కడప నగరం కో ఆపరేటివ్ కాలనీలో జిమ్ సెంటర్ నిర్వహిస్తున్న జంతు ప్రేమికుడు బాషా మోహిద్దీన్ ఎప్పటిలాగే తన మిత్రులతో కలిసి సిద్దవటం, అట్లూరు ప్రాంతాలలో అటవీ జంతువులకు పండ్లు, నీరు ఏర్పాటు చేసేందుకు వెళ్లారు. అదే సమయంలో పలువురు యువకులు మోటారు బైకులపై అత్యంత వేగంగా కోతులను కంగారు పెట్టేలా నడుపుతూ వెళ్లారు. ఈ క్రమంలో రెండు కోతులు బైకుల కింద పడి గాయపడటం బాషా మోహిద్దీన్ గమనించారు. వెంటనే వాటిని పక్కకు తీసుకు వచ్చి సపర్యలు చేశారు. కాళ్లు దెబ్బతిన్న కోతి కుంటుతూనే చెట్ల పొదల్లోకి వెళ్లిపోయింది. మరో కోతి తీవ్రంగా వణికిపోతూ బాషా మొహిద్దీన్ చేతిలోనే మరణించింది. వారం రోజులు కూడా లేని దాని బిడ్డ తల్లి కలేబరం చుట్టూ తిరుగుతూ కేకలు పెడుతూ ఉండడం బాషామోదీన్, మిత్ర బృందాన్ని కంటతడి పెట్టించింది. జంతువులకు కూడా మన లాగా ప్రాణముంటుందని.. వాటిని బతకనివ్వాలని కోరారు. యువత అటవీ ప్రాంతాల్లో వెళ్లే టపుడు బైక్‌ల వేగం తగ్గించాలని సూచించారు.

పాఠ్యాంశాల తొలగింపును విరమించుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాఠ్యాంశాల తొలగింపును విరమించుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ పేర్కొన్నారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మతతత్వ, నియంతృత్వ బీజేపీ విధానాలను అమలు చేసేందుకు విద్య, పరిశోధన, శిక్షణ జాతీయ మండలి ఇష్టానుసారంగా పాఠ్యాంశాలను తొలగించడం దారుణమన్నారు. విద్యార్థులకు సృజనాత్మక శక్తిని పెంపొందించే శాస్త్రీయ విద్యను, లౌకిక ప్రజాస్వామ్య విలువలను నేర్పించాలన్నారు. ఏఐవైఎఫ్ నాయకులు దస్తగిరి, మైనుద్దీన్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నేడు యునాని వైద్య శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బీజీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉచిత ఆయుర్వేదిక్ యునాని మెడికల్ క్యాంప్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్నాల్డ్ జిమ్ నిర్వాహకుడు షేక్ న్యామతుల్లా తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో తొలిసారిగా ఆర్నాల్డ్ జిమ్ ఆధ్వర్యంలో కర్నాటకకు చెందిన హకీం అమనుల్లాఖాన్‌తో వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, క్యాన్సర్, కీళ్లనొప్పులు తదితర వ్యాధుల వారికి వైద్యపరీక్షలు చేస్తారన్నారు. మన ఇంటిలో వంట గదిలో లభించే వస్తువులతో ఎలా ఆరోగ్యంగా జీవించవచ్చో వివరిస్తారన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు అన్వర్‌బాషా, ముక్తియార్, శివ, షేక్ సమద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై ప్రజలకు అవగాహన

నెల రోజులుగా 'లైఫ్' కార్యక్రమాలు

కడప అర్బన్: పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించుట కోసం జిల్లా ఫారెస్ట్ అధికారి పి.వి. సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో నెల రోజుల నుంచి జిల్లా అటవీశాఖ పరిధిలో 9 రేంజ్‌లలో ప్రతి రోజూ ఐదు 'లైఫ్' కార్యక్రమాలు నిర్వహించారు. కడప నగర ప్రజలకు అందుబాటులో నగరవనాన్ని ఎంతో సుందరంగా తీర్చి దిద్దడంలో తమ వంతుగా కృషి చేశారు. చెట్లకు అరుగులు, చిన్నపిల్లల కోసం ప్రత్యేకంగా ప్లే జోన్, యువకుల కోసం ఓపెన్ జిమ్, షటిల్‌కోర్టు, వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. పర్యావరణ దినోత్సవం ముందస్తు ఏర్పాట్లలో భాగంగా గార్డెన్‌ను ఏర్పాటు చేశారు.

నగరవనానికి ప్రతి పౌరుడు తనకుతాను స్వచ్ఛందంగా పర్యావరణం పట్ల బాధ్యతగా ప్రవర్తించే విధంగా ప్రతిజ్ఞ చేసేందుకు స్టాండర్డ్ బోర్డులను ఏర్పాటు చేశారు. కడప నగర ప్రజలకు ప్రతి ఆదివారం నగరవనం నుంచి పాలకొండల వరకు ట్రెక్కింగ్ నిర్వహిస్తున్నారు. గువ్వల చెరువు వద్ద ఏర్పాటు చేయదలచిన ఎకో టూరిజం పనులను చురుకుగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని జూన్ 5న నిర్వహించే పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీశాఖ ఆధ్వర్యంలో పలు రకాలుగా నిర్వహించదలచిన లైఫ్ కార్యక్రమాలను కడప రేంజ్ ఎఫ్‌ఆర్‌ఓ బాలసుబ్రమణ్యం ఆదేశాల మేరకు మామిళ్లపల్లి సెక్షన్ పరిధిలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎస్. ఓబులేసు ఆధ్వర్యంలో, భాకారాపేట సెక్షన్ పరిధిలో సెక్షన్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాసులు ఆధ్వర్యంలో, మద్దిమడుగు సెక్షన్ పరిధిలో సెక్షన్ ఆఫీసర్ ఎస్.ఎం షకీల్ ఆధ్వర్యంలో ప్రతి రోజూ పర్యావరణం పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.